క్లుప్తంగా

గజ వాహనంపై శ్రీవారి రథోత్సవం



నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎస్ కాలనీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అగ్ని ధ్యానం, నిత్య హోమం వసకుంభారోహణం, శ్రీవెంకటేశ్వర మూల మంత్ర హోమంను వేద పండితులు నిర్వహించారు. స్వామి వారు, అమ్మవార్ల రథోత్సవాన్ని 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్ నగర్ పుర వీధుల్లో కొనసాగగా, భక్తులు స్వామి వారు, అమ్మ వార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి డాక్టర్ పుచ్చా వెంకటమల్లేశ్వర్ పాల్గొన్నారు.

రూరల్ మండలం ఏఓగా కిషోర్



గుంటూరు రూరల్: గుంటూరు రూరల్ మండలం వ్యవసాయ శాఖ అధికారిగా బి.కిషోర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉంటూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయన గతంలో మార్కాపురం ఎస్టీఎల్‌లో పనిచేసి డిప్యూటేషన్‌పై గుంటూరు-2 టౌన్ ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం పెదనందిపాడుకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో కిషోర్ బాధ్యతలు స్వీకరించారు.

డ్వాక్రా రుణాల మోసం.. అదృశ్యమైన యానిమేటర్



గుంటూరు రూరల్: తమకు తెలియకుండా తమ పేర్లతో డ్వాక్రా రుణాలను పొంది తమను నట్టేట యానిమేటర్, సంబంధిత అధికారులు ముంచేశారని చౌడవరం గ్రామంలోని డ్వాక్రా మహిళలు వాపోయారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తమకు యానిమేటరుగా పనిచేస్తున్న కంచర్ల భవ్యశ్రీ ప్రతి నెలా గ్రూపు సభ్యుల నుంచి లోన్లకు సంబంధించి నగదు వసూలు చేసి బ్యాంకులో కడుతుందని మహిళలు తెలిపారు. కానీ గత నాలుగు రోజుల క్రితం గుంటూరు కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది తమ గ్రామానికి వచ్చి ఇంటింటికీ తిరిగి మీ ఒక్కొక్కరి పేరు మీద రూ.లక్ష రుణం ఉందని మహిళలకు తెలిపారన్నారు. ఈ సంఘటన విని స్పందించిన మహిళలు మేము ఎటువంటి రుణం తీసుకోలేదని అంతా కలిసి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో యానిమేటర్, సంబంధిత అధికారులపై ఫిర్యాదు చేశామన్నారు. అదృశ్యమైన ఆమెను అందుపులోకి తీసుకుని తమకు న్యాయం చేయాలని మహిళలు డిమాండ్ చేశారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

తెనాలిరూరల్: గంటూరు నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్ర వా రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ సీఐ ఆర్. ఉమేష్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పట్టణ ఐతానగర్‌కు చెందిన సుకుమార్ మండలంలోని సోమసుందరపాలెంకు చెందిన అలికిపల్లి సాంబిరెడ్డి, కొల్లిపర మండలం తూములూరుకు చెందిన కురగంటి చైతన్య, పెదరావూరుకు చెందిన పగడం మణిసింహారెడ్డి స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు డబ్బుల కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. గంటూరు కొత్తపేటకు చెందిన వృద్ధుడు రత్తయ్య వద్ద కొనుగోలు చేసి తీసుకువచ్చి పొట్లాలు కట్టి విక్రయిస్తున్నారు. గంజాయి విక్రయాలపై సమాచారం రావడంతో రూరల్ ఎస్‌ఐలు ఆనంద్, శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ చెంగలరాయుడు, కానిస్టేబుళ్లు డి. రవి, సుబ్బారెడ్డి నందివెలుగు ప్రధాన కూడలిలో గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై సాంబిరెడ్డి, చైతన్య, మణిసింహారెడ్డి త్రిపుల్ రైడింగ్ చేస్తూ కనబడ్డారు. వారి వాహనాన్ని తనిఖీ చేయగా 1400 గ్రాముల గంజాయి లభించింది. సుకుమార్‌కు చెందిన బైక్‌లో స్నేహితులందరూ గుంటూరు వెళ్లగా తనకు వేరే పని ఉంది తర్వాత వస్తానంటూ సుకుమార్ అక్కడే ఆగిపోయాడు. నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా రత్తయ్య నుంచి తరచూ కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. సుకుమార్, రత్తయ్య పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

మౌలిక వసతులపై దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



పనులపై సిబ్బందితో చర్చిస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయిన్స్ నిర్మాణాలు చేపట్టడానికి ఏఈల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రాధాన్య క్రమంలో చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గోరంట్ల, కోదండరాం నగర్, నగరాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఏఈల వారీగా ఆయా ప్రాంతాల్లో ముఖ్యమైన మౌలిక వసతులైన రోడ్లు, డ్రెయినేజ్ తాగునీటి పైప్ లైన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని కోరారు. ప్రతి ప్రాంతంలో సిమెంట్ రోడ్లు కాకుండా తొలుత ప్రజల రాకపోకలకు వీలుగా జీఎస్బీ రోడ్లను డ్రెయిన్లతో కలిపి ప్రతిపాదించాలని సూచించారు. కోదండరాం నగర్ స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు ఆయా ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించి, తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి అందే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం పారిశుద్ధ్య పనులపై ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగితే రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు ఉండవన్నారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఏఈలకు షోకాజ్ నోటీసులు

నగరంలో మున్సిపల్ ట్యాప్ కనెక్షన్ల మంజూరులో నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడేలా వ్యవహరించిన ఏఈలు పి.వెంకటేశ్వరరావు, కె.సాంబశివరావులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని కమర్షియల్, బహుళ అంతస్తు భవనాలు, నివాస గృహాలకు సాధారణ ఫీజులకు మూడు రెట్లు డొనేషన్, నీటి చార్జీలను విధిస్తూ, మీటర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా.. సదరు ఏఈలు నిబంధనలు పాటించకుండా ట్యాప్ కనెక్షన్ల కోసం తమ లాగిన్‌ల ద్వారా తుది మంజూరు కోసం ఫైల్ పంపారన్నారు. నగరపాలక సంస్థకు ఆర్థిక నష్టం కలిగించేలా వ్యవహరించిన ఏఈలకు 3 రోజుల్లో సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేశామని, వారు ఇచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో వార్డు ఎమినిటి కార్యదర్శులు నిబంధనల మేరకు అన్ని డాక్యుమెంట్స్ ఉన్న వాటికే ట్యాప్ మంజూరు దరఖాస్తు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సి.నారాయణరెడ్డి చిరస్మరణీయుడు



సి.నా.రె. చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: కవి, సాహితీ శిఖరం, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీ మూర్తి, గొప్ప పరిశోధకుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి అని అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు బిళ్ళా అశోక్, కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సాహితీ మూర్తి సి.నారాయరెడ్డి వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాహితీ ప్రియులందరికీ క్లుప్తంగా సి.నా.రె.గా సుపరిచితులైన ఆయన యావత్తు భారతీయ సాహిత్యానికి గర్వకారణమని పేర్కొన్నారు. సుమారు ఏడు దశాబ్దాల సాహితీ ప్రస్థానంలో సి.నా.రె. 90కి పైగా గ్రంథాలు రచించారన్నారు. ఆయన రచనలన్నీ ఆణిముత్యాలేనన్నారు. ఆయన తెలుగు సాహిత్యంలో సి.నా.రె. చేయని ప్రయోగం లేదని ఆయన రచనలు ఇంగ్లీష్, ఫ్రెంచి, సంస్కృతం, హిందీ, మళయాళం, ఉర్దూ, కన్నడ, భాషలలో అనువాదమయ్యాయన్నారు. సి.నా.రె ఉర్దూలో గజలర్స్ రాశారని గుర్తు చేశారు. అనంతరం రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, లక్ష్మీబాబూరావు, మల్లేశ్వరరావు, రాజ్యలక్ష్మి, తదితరులు సి.నా.రె గీతాలను ఆలపించారు.

మాటలకు అందని మహావిషాదం..

గుజరాత్ రాజధాని అహమ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి అందులోని ప్రయాణికులు, సిబ్బంది కూలిన ప్రాంతంలో ఉన్న వైద్య విద్యార్థులూ దుర్మరణం చెందడం అత్యంత విషాదకరమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. గుంటూరు అరండల్‌పేట సంస్థ కార్యాలయంలో శుక్రవారం నివాళులర్పించారు.

మొబైల్ బుక్ కీపింగ్ పై అవగాహన

కొల్లిపర: స్వయం సహాయ సంఘాలకు చెందిన ఎటువంటి లావాదేవీలు ఇక నుండి మొబైల్ బుక్ కీపింగ్ యాప్ ద్వారా ఆన్లైన్ లో ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చని ఐబీ డీపీఎం బీ.కామేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వయం సహాయ సంఘాలకు మొబైల్ బుక్ కీపింగ్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఐదు గ్రామ సంఘాలు ప్రభుత్వం ఎంపిక చేసి పైలెట్ గా ఈ యాప్ ను ఆయా గ్రామాలలోనే స్వయం సహాయ సంఘాలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం యాప్ ద్వారా స్వయం సహాయ సంఘాలు జరుపుతున్న లావాదేవీలు ఎప్పటికప్పుడు ఏ విధంగా పరిశీలించాలి అన్న అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పి.రమాదేవి, సీసీలు టి.మధు, పూర్ణయ్య నాగుల్ ఖాన్, వెంకటరత్నం, వివో ఎస్.సుధారాణి, స్రవంతి, బసమ్మ, సునీత, స్వాతి, ధర్మతేజ, స్వర్ణభారతి, శ్రీ సాయి, శ్రీ రేణుకా దేవి, శ్రీ రామలింగేశ్వర గ్రామ సంఘాలు పాల్గొన్నారు.

కళాశాల వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న యశ్వంత్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: అక్రమంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతూ వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్న జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి బండారపు యశ్వంత్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పట్టాభిపురంలో కళాశాల వద్ద ధర్నా చేపట్టారు. యశ్వంత్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా పాఠ్య పుస్తకాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంబంధిత కళాశాలపై విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందస్తు అడ్మిషన్‌ల పేరుతో కళాశాల యాజమాన్యాలు తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి మాయ మాటలు చెప్పి అడ్మిషన్లు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పుస్తకాలపై వారి కళాశాల పేరును ముద్రించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత కళాశాలల యాజమాన్యంపై చర్యలు చేపట్టకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలకి సిద్ధమవుతామని హెచ్చరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి అమర్నాథ్, నగర సహాయ కార్యదర్శి వెంకట్, నగర నాయకులు అజయ్, భాస్కర్, చందు, సాయి గణేష్, సాయి, టి.అజయ్, సతీష్ పాల్గొన్నారు.

22 నుంచి మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె



ఇన్‌చార్జి అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెహ్రూనగర్: రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి నుంచి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలోకి వెళ్తున్నట్లు ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఈదులమూడి మధుబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి అడిషనల్ కమిషనర్ డి.శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు జీతం రూ. 6 వేలకు ఏ విధంగా పెంచిందో అదే విధంగా నాన్ పీహెచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 28 రకాల పనులు చేసే కార్మికులకు కూడా పెంచాలని కోరినా ఎటువంటి ఫలితం లేదన్నారు. నాన్ పీహెచ్ వర్కర్ల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్‌తో గత 38 రోజులుగా రాష్ట్రంలోకి పలు మున్సిపాలిటీల్లో కొన్ని యూనియన్లు సమ్మె చేస్తున్నాయని... ఈ నెల 22 అర్ధరాత్రి నుంచి అన్ని యూనియన్లతో కలిసి సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సిలబస్ భారాన్ని తగ్గించి, శాస్త్రీయతను పెంపొందించాలి



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో డాక్టర్ శంకర్, గోపీచంద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులపై సిలబస్ భారాన్ని తగ్గించి, శాస్త్రీయతను పెంపొందించడంలో జాతీయ నూతన విద్యా విధానం దోహదం చేస్తుందని ఐక్యూఏసీ క్లస్టర్ అడ్వైజర్ డాక్టర్ ఎస్.శంకర్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల ఐక్యూఏసీ, క్లస్టర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శంకర్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయత, ప్రయోగాత్మక పద్ధతులను ప్రోత్సహించేందుకు కృషి చేయాలని సూచించారు. వివిధ భారతీయ భాషలను అధ్యయనం చేసేందుకు అవకాశాలు కల్పించాలని కోరారు. అపార్ గుర్తింపు సంఖ్య ద్వారా విద్యార్థులకు సంబంధించిన మార్కులు, సర్టిఫికెట్లు, డిగ్రీలను డిజిటల్‌గా దాచుకునే సదుపాయాని కల్పించినట్లు వివరించారు. నాలుగేళ్ల డిగ్రీ విద్యలో విద్యార్థి ఎప్పుడు కావాలంటే అప్పుడు సంవత్సరాంతంలో చదువు నుంచి నిష్క్రమించే వెసులుబాటు ఉందని చెప్పారు. మొదటి ఏడాదికి సర్టిఫికెట్, రెండో ఏడాదికి డిప్లొమా, మూడో సంవత్సరంలో డిగ్రీ, నాలుగో సంవత్సరాంతానికి ఆనర్స్‌ను ప్రదానం చేస్తారని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడారు. కార్యక్రమ కార్యనిర్వాహక కార్యదర్శి టి.బాల నరేంద్ర ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, 187 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈనెల 15న యోగాసనాల పోటీలు

నగరంపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ గుంటూరు, ఓంకార్ యోగా ఫెడరేషన్, ఎస్‌కేపీ టెంపుల్ యోగా గ్రూప్స్ సంయుక్తంగా ఈనెల 15న ఆర్.అగ్రహారం గీతా మందిరంలో యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు వాసవిక్లబ్ అధ్యక్షులు రాయవరపు అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జూలై 10 నుంచి చాతుర్మాస్య వ్రతం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు, సాయిఈశ్వర్

నగరంపాలెం: రైతులు, ప్రజలు క్షేమంగా ఉండాలని కోరుతూ విశ్వావసు నామ సంవత్సరం 22వ చాతుర్మాస్య వ్రతం వచ్చే నెల పదో తేదీ నుంచి సెప్టెంబర్ ఏడో తేదీ వరకు నిర్వహించనున్నట్లు ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. ఆర్ అగ్రహారం కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆంజనేయులు మాట్లాడుతూ కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వైశ్యగురు మఠం వారణాసి, హల్దీపూర్(కర్ణాటక) ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని ఆర్యవైశ్యుల అందరూ హాజరుకావాలని కోరారు. కర్ణాటక నుంచి విచ్చేసిన సాయిఈశ్వర్ మాట్లాడుతూ ఈ ఏడాదికి వ్రతాన్ని గుంటూరు ప్రాంతంలో నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. వైశ్య బంధువులు సేవల్లో గొప్ప స్థితిలో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీసీ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, టీఎల్‌వీ వీరాంజనేయులు, ఈరంటి వరప్రసాద్ (బాబు), కొనకళ్ల సత్యం, కృష్ణమూర్తి, గొల్లపూడి కాశీవెంకటరాంబాబు, ఆతుకూరి నగేష్, రవికుమార్ పాల్గొన్నారు.

అందరికీ తల్లికి వందనం ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి

లక్ష్మీపురం: అనేక నిబంధనలతో ప్రత్యేకించి రేషన్ కార్డు ఉన్నవారికే తల్లికి వందనం ఇస్తామన్న పేరుతో పేదలు, చిరుద్యోగులకు తల్లికి వందనం ఆర్థిక సహాయం ఇవ్వకపోవడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు అన్న పేరుతో చిరుద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ, యానిమేటర్లు, తదితర స్కీం వర్కర్లు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇంతకు ముందే రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు ఇవ్వకుండా దూరం చేయబడ్డారని తెలిపారు. ప్రస్తుతం తల్లికి వందనం పేరుతో ఇచ్చే ఆర్థిక సహాయం కూడా రేషన్ కార్డు ఉన్నవారికే ఇస్తామనడంతో ఇలాంటి వారందరూ ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందే అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం చిరు ఉద్యోగులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి హామీ మేరకు ఇప్పటివరకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా ఇందుకు విరుద్ధంగా తల్లికి వందనం నుంచి కూడా వారిని దూరం చేయడం సరైనది కాదని చెప్పారు. షరతులు లేకుండా చిరుద్యోగులు, పేదలు అర్హులైన వారందరికీ తల్లికి వందనం అమలు చేయాలని నేతాజి డిమాండ్ చేశారు.

పాఠశాలను తెరవాలంటూ విద్యార్థుల ఆందోళన



మూసివేసి ఉన్న పాఠశాల



పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు

కరస్పాండెంట్ రద్దుకు సిఫార్సు చేస్తామని చెప్పిన డీఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: ఏటుకూరురోడ్డు చాకలిగుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ తమ పాఠశాలను తెరవకపోవడంతో తాము చదువుకునే అవకాశం లేకుండా పోయిందని చిన్నారులు వాపోయారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను వివరణ కోరగా, రేకుల షెడ్డులో నడుపుతున్న ఎయిడెడ్ పాఠశాల శిథిలావస్థకు చేరి, విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. పాఠశాల తెరువని విషయమై సమాచారం తెలిసిన వెంటనే ఎంఈఓను పాఠశాలకు పంపి, విచారణ నిర్వహించినట్లు తెలిపారు. కనీస సదుపాయాలు లేకుండా పాఠశాలను నిర్వహిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అందుకు అనుమతించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. తాగునీరు, టాయిలెట్ల వసతి లేదని తెలిపారు. పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు కరస్పాండెంట్ షిప్ రద్దుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని చెప్పారు. విద్యార్థులను సమీపంలోని నగరపాలకసంస్థ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): 11 కేవీ ప్రగతీనగర్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ-4 డీఈఈ పీహెచ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. బాలాజీ నగర్, అంబటి రామయ్యనగర్, ప్రగతీనగర్, రాజీవ్ గృహ కల్ప తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

- డీ-13 సెక్షన్ ఆర్టీసీ కాలనీ పరిధిలో లైన్ మెయింటెనెన్స్ కారణంగా నందివెలుగు రోడ్, ఆర్టీసీ కాలనీ, విజయవాడ రోడ్, ఇశ్రాయిల్‌పేట, ధనమ్మ హోటల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని చెప్పారు.
- 33/11 కేవీ ఆటోనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరా అంతరాయం గడ్డిపాడు, గణేష్‌నగర్, ఏఎస్ కన్వెన్షన్, గాయత్రీనగర్, ఆటోనగర్, విశ్వనాథం హోటల్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని అసిస్టెంట్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఫీడర్ల మరమ్మతుల నిమిత్తం డీ-3 సెక్షన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-1 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షేక్ ముస్తాక్ అహమ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లాలాపేట ఫీడరు, 11 కేవీ టాలీవుడ్ ఫీడర్, కొత్తపేట, శివాలయం రోడ్, లాలాపేట, అహమ్మద్ నగర్, పొత్తూరివారితోట, మాయాబజార్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోత ఉంటుందని చెప్పారు.

గుంటూరు రూరల్: పెదనందిపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరగాని, పెదనందిపాడు సబ్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సబ్ స్టేషన్‌లో 11కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల నిమిత్తం విద్యుత్ నిలిపి వేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యా రంగంలో ఏఐను వినియోగించాలి



వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన అధ్యాపకులతో కేవీ బ్రహ్మం, కృష్ణ శివప్రసాద్, కామేశ్వరశాస్త్రి, అనితాదేవి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించాలని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.కృష్ణ శివప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో 'ఏఐ టూల్స్ ఫర్ టీచింగ్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ హెచ్ కామేశ్వరశాస్త్రి అధ్యక్షత వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు సిద్ధం కావాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో వేగ వంతమైన జ్ఞానాన్ని తక్కువ సమయంలో పొందవచ్చునని చెప్పారు. విద్యా బోధన, పరిశోధనా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించే విధానాలను వివరించారు. అదే విధంగా కంప్యూటర్ ల్యాబ్‌లను వినియోగించే విధానంపై ప్రాక్టికల్‌గా శిక్షణ కల్పించారు. వర్క్‌షాప్ అనంతరం కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం చేతుల మీదుగా అధ్యాపకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితా దేవి, డాక్టర్ యు.రవి కుమార్, డాక్టర్ నాగ నిర్మల, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డిగ్రీ, పీజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

దొరికిన పర్సు పోలీసులకు అందజేత



తెనాలిరూరల్: రోడ్డుపై పడి ఉన్న పర్సును సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పోలీసులకు అప్పగించాడు. మండలంలోని చావావారిపాలేనికి చెందిన చిక్కాల తరుణ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల వర్క్ ఫ్రం హోం కింద స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం రాత్రి బైక్‌పై తెనాలి వచ్చిన అతను రైల్వే స్టేషన్ రోడ్డులోని పెట్రోలు బంకులో పెట్రల్ కొట్టించుకుని దాని ఎదురు రోడ్డులోకి వెళ్లగా రోడ్డుపై పర్సు పడి ఉండడాన్ని గమనించాడు. పర్సులో నగదు, ఏటీఎం కార్డులు, ఆధార్ కార్డు ఉంది. చుట్టుపక్కల వాళ్లను వాకబు చేసిన ఎవరి పర్సు పోలేదని చెప్పగా, వెంటనే సమాచారాన్ని తెనాలి ట్రాఫిక్ విభాగంతో హోంగార్డుగా పని చేస్తున్న తన తండ్రి సింగ్‌కు తెలిపాడు. ఆయన సూచన మేరకు ఇరువురూ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ నక్కా ప్రకాశరావుకు పర్సును అందజేశారు. నిజాయితీగా పర్సును అందజేసిన తరుణ్‌ను ఎస్ఐ, త్రీ టౌన్ సిబ్బంది అభినందించారు.